నట్టింట్లో ఉయ్యాల బల్ల మీద శేషతల్పశాయి భంగిమలో పడుకొని రాఘవశర్మ పాడటం మొదలుపెట్టాడు. "నానాటి బతుకు నాటకము" అని. వంటింట్లో నుంచి బయటకు చూస్తూ భార్య మంగతాయారు "పొద్దున్నే ఆ పాట మొదలుపెట్టారు, హాయిగా ఉయ్యాల బల్లమీద ఊగుతూ ఆ వైరాగ్యం పాట ఏమిటి?" అడిగింది. "ఆ పాటలో ఎంత కటిక సత్యము ఉన్నదే తాయారు? అంతా నాటకమే కదా! అందరూ యథాశక్తి నటిస్తూనే ఉన్నారు" అన్నాడు.

"ఇపుడు ఎవరి నటన గురించి ఆ పాట?" అడిగింది. "ఇంకెవరు నీ గురించే" అన్నాడు. "నా గురించా? నేనేమి నటించాను?" ఆశ్చర్యంగా అడిగింది. "నటన కాక మరేమిటి? కాఫీ అడిగి ఎంతసేపు అయింది? వినపడనట్లు నటిస్తూ ఎంత చాకచక్యంగా నా ముందు నుంచే తిరుగుతూ నీ పని నీవు చేసుకుంటూపోతున్నావు?" అన్నాడు.

"ఓహో అదా! నేను మీకు కాఫీ ఇవ్వదలచుకోలేదు, అందుకే పట్టించుకోలేదు. గంట పది కూడా కాలేదు ఇప్పటికి మూడు కాఫీలు తాగారు, ఇలా అయితే బియ్యంతో పాటు కాఫీపొడి పంచదార కూడా బస్తాలు వేయించుకోవాలి" అన్నది నవ్వుతూ.

"భలే ఆలోచన చెప్పావోయ్! వాటితోపాటు ఒక మంచి పాడిగేదెను కూడా కొంటే, చిక్కటి పాలతో ఫిల్టర్ కాఫీ చేసుకొని తాగితే ఉంటుంది! ఓహో! స్వర్గం అంటే అదే కదే పిచ్చిదానా?" అన్నాడు చేతులు పైకెత్తి చూపుతూ. అలాగా! అయితే అన్నం పెట్టకుండా రోజంతా కాఫీలే ఇస్తాను తాగి ఆ స్వర్గసుఖమేదో బాగా అనుభవించండి" అన్నది వ్యంగ్యంగా. "ఆ పని మాత్రం చేయవాకసేవ్! స్వర్గసుఖం సంగతి అటుంచి ఏకంగా స్వర్గస్తుణ్ణే అయిపోతా" అన్నాడు పెద్దగా నవ్వుతూ. అంతలో తలుపు కొట్టిన చప్పుడు.

రాఘవశర్మ తలుపు తీసేసరికి ఇద్దరు దంపతులు నిలబడిఉన్నారు. "మీరు?" అన్నాడు రాఘవశర్మ గుర్తించటానికి ప్రయత్నిస్తూ. "మేము ఎవరో గుర్తుపట్టలేదా? సరే! ప్రయత్నించు", అంటూ అతను భార్యతో కూడా లోపలికి వచ్చి కూర్చున్నాడు. వాళ్ళెదురుగా వచ్చి కూర్చొని పరిశీలనగా చూస్తున్నాడు రాఘవశర్మ. వంటింట్లో నుంచి వచ్చి తాయారు కూడా భర్త ప్రక్కన నిలబడి చూస్తున్నది.

రాఘవశర్మ ఊహిస్తున్నాడు "ఈయన ఎవరై ఉంటాడు? ఎవరి కోసమో జాగ్రత్తగా కుట్టిన కోటు ఈయన వేసుకొని వచ్చినట్లున్నాడు; కోటు తీసేస్తే అసలు లోపల మనిషి ఉన్నాడా అనే శరీర దారుఢ్యం, కోటుపైన నిలబెట్టిన ఎండు కొబ్బరిబొండంలా తల, గట్టిగా ఫాను స్పీడు పెంచితే నాలుగు గోడలకు గుద్దుకొని నేల కరుచుకొనేంతటి బలశాలి, భార్య ప్రక్కన కూర్చున్న వాలకం చూస్తుంటే ఆమెదే ఇంట్లో పైచేయి అనే నమ్మకం, ఇంతకీ ఇతగాడు ఎవరు? అని.

**కథ**

ఇక తాయారు అనుకుంటున్నది "ఈమె ఎవరు? స్వదేశీ వనితా? విదేశీనా? ఆ తలకు వేసిన రంగు తమాషాగా ఉందే! చెవిలో ఏమిటి? చెమిటి మిషనా? వింతగా కనపడుతున్నారు, ఎవరై ఉంటారు?" అని.

"ఏమిటి? మమ్మల్ని ఇంకా గుర్తుపట్టలేదా?" అడిగాడు అతను. "లేదు గొంతు మాత్రం పరిచితమైనట్లు ఉన్నది కానీ" అని నీళ్ళు నములుతున్నాడు రాఘవశర్మ. కళ్ళజోడు తీసి "నేనురా! రాఘవా! గణపతిశాస్త్రిని, ఈమె నా భార్య లలిత" అన్నాడు అతను.

ఒరే గణపతి నువ్వట్రా! పోల్చుకోలేకపోయాను, శుభ్రంగా పంచకట్టు, లాల్చీ, నుదురుమీద విభూదిరేఖలతో ముచ్చటగా ఉండేవాడివి ఏమిటిరా ఈ అవతారం?, మనం కలిసి కొన్ని నెలలేగా అయింది అంతలోనే ఎంత మార్పు? ఆశ్చర్యంగా అడిగాడు రాఘవశర్మ.

# పడమటి గాలి




**భీమరాజు వెంకటరమణ**

"మా వాడు అమెరికాలో ఉంటున్నాడు తెలుసుగా! మమ్మల్నీ అక్కడకు రమ్మంటున్నాడు, అందుకే అక్కడి పరిస్థితులకు తగ్గట్లు తయా రవ్వాలనే ఈ ప్రాక్టీసు" అన్నాడు దంబాలు కొడుతూ. మరి మీ ఆవిడ జుట్టు అలా అయిపోయిందేమిటి? వినికిడి ఏమైనా తగ్గిందా? పాపం చెమిటి మిషను పెట్టారు?" అడిగాడు కాస్త జాలిగా.

"ఒరే! ఒరే! నీ సందేహం బంగారంగాను, మా ఆవిడ తలకు రంగు వేసిందిరా! నల్లరంగు ఫ్యాషన్ కాదని రాగిరంగు వేసింది, కాస్త ఎక్కువైయింది అంతే, ఇకపోతే అది చెమిటిమిషను కాదు, దాన్ని ఐపాడ్ అంటారు, మా వాడు అమెరికా నుండి పంపాడు, బోలెడన్ని పాటలు రికార్డు చేసికొని వినొచ్చు" అన్నాడు గణపతిశాస్త్రి ఇంకాస్త ఫోజుకొడుతూ.

"ఓరి వీళ్ళ ఆర్భాటం అడవికెళ్ళా! ఎలాంటివాళ్ళు ఎలా అయిపోయారు? అయినా కొడుకు అమెరికాలో ఉంటే వీళ్ళు ఇక్కడ చిందులేస్తున్నారే! అనుకున్నాడు రాఘవశర్మ.

తాయారు కలుగజేసుకుంటూ "మొత్తానికి మమ్మల్ని కాసేపు అయోమయంలో పడేసారు అన్నయ్యగారు!, వదినా! బావున్నావా? వేణు ఎలా





రాఘవశర్మ, తాయారు, కళ్యాణి, అప్పటికే వచ్చి ఉన్న ఆమె స్నేహితురాళ్ళు అందరు వేణూ కోసం ఎదురుచూస్తున్నారు. సరిగ్గా అదే సమయానికి ఒక యువకుడు యమహా మోటర్ సైకిల్ మీద వచ్చాడు. లాల్చీ పైజమా వేసుకొని ఉన్నాడు, బంగారు ఛాయ, నడకలో ఠీవి, ముఖంలో మందహాసం చూడముచ్చటగా ఉన్నాడు. "వావ్! వాటే హేండ్సం గై!" అన్నది ఒక స్నేహితురాలు.


ఉన్నాడు? అమెరికా నుండి తరచూ ఫోన్లు చేస్తున్నాడా?" అడిగింది.

"బావున్నాడు వదినా! ఫోన్లు చేస్తూనే ఉన్నాడు, నిన్న ఒక ముఖ్యమైన ఫోన్ చేసాడు, అందుకే మీ ఇంటికి వచ్చాము" అన్నది. "అలాగా? ఏమిటి అంత విశేషం? కాస్త ఆశ్చర్యపోతూ అడిగింది తాయారు.

"మా వాడికి మీ కళ్యాణిని చేసుకోవాలని ఉంది, అదే కనుక్కోమన్నాడు, మా వాడు మీకూ తెలుసు, ఈ ప్రస్తావన మన ఇద్దరిమధ్య ఒకసారి వచ్చింది కూడానూ, అప్పట్లో వాడు పెళ్ళి ధ్యాసలో లేడని ఊరుకున్నాము" అన్నది లలిత. రాఘవశర్మ దంపతుల ముఖాలు వెలిగాయి, "నిజానికి మేమే మిమ్మల్ని అడగాలని అనుకుంటున్నాము, ఆశ్చర్యంగా మీరే వచ్చారు" అన్నది తాయారు.

"రెండు వారాల్లో మా వాడు వస్తాడు, రెండు వారాలే ఉంటాడు, అంతా చకచకా జరిగిపోవాలి" అన్నాడు గణపతిశాస్త్రి. "మరీ ఇంత తక్కువ వ్యవధిలోనా, పెళ్ళి పనులు చేయగలమా" కాస్త ఆశ్చర్యంగా అడిగాడు రాఘవశర్మ. "ఇవాళా రేపు అంతా పేకేజీ పద్ధతే కదోయ్! ఫోనులో అందరికి పనులు పురమాయించడమే! నీవు వెంటనే చెయ్యవలసినదల్లా కళ్యాణమండపం బుక్ చెయ్యడమే, మిగతావన్నీ అవే జరిగిపోతాయి" చెప్పాడు గణపతిశాస్త్రి.

"ఇంతకీ మా కోడలు పిల్ల ఏది?" అని లలిత అడుగుతుండగానే కళ్యాణి బయటనుంచి వచ్చింది, "అదిగో మాటల్లోనే వచ్చేసింది" అన్నది తాయారు. కళ్యాణి వాళ్ళని అర్థం కానట్లు చూసింది. "ఇంతలో రాఘవశర్మ "కళ్యాణీ! గుర్తుపట్టలేదా? గణపతిశాస్త్రి, నా చిన్ననాటి స్నేహితుడు, వేణు అమ్మా నాన్నలు అనగానే "నమస్కారమండి" అన్నది వినయంగా. కాబోయే కోడలిని కళ్ళారా చూసుకొని బాగా సంతోషపడ్డారు ఆ దంపతులు.

"సరేరా! ఇక మేము బయలుదేరుతాం, వెంటనే మా సిద్ధాంతిని సంప్రదించి, ముహూర్తాల వివరాలు కనుక్కొని నీకు ఫోన్ చేస్తాను" అంటూ భార్యతోపాటు ఠీవిగా కారు దగ్గరకు వెళ్ళాడు గణపతిశాస్త్రి. వాకిలిదాకా వచ్చి వీడ్కోలు పలికారు ముగ్గురూ. రాష్ట్రపతి దంపతులు విదేశాలకు వెళ్ళేప్పుడు విమానం ఎక్కుతూ చేతులు ఊపినట్లు ఊపి కారులో ఎక్కి వెళ్ళారు గణపతి దంపతులు.

లోపలికి వస్తూ రాఘవశర్మ "అయినా వీడి బడాయి ఏమిటే? వీడే ఇట్లా ఉంటే ఇంక వీడి కొడుకు ఎట్లా ఉన్నాడో అక్కడ, ఏడాదిన్నరయింది చూసి" అన్నాడు. "చాల్లే ఊరుకోండి! నాలుగు రూపాయలు వచ్చాయి, కాస్త డాబుసరి చూపిస్తున్నారంతే, అబ్బాయిని మనం బాగా ఎరుగుదుము కదా!" అన్నది తాయారు.

"ఏమ్మా కళ్యాణీ! అర్థం అయిందిగా వాళ్ళ వేణుకి నిన్ను చేసుకుంటామంటున్నారు, ఇంతకీ నువ్వేమంటావ్? అడిగాడు రాఘవశర్మ. "మీకు ఇష్టం అయితే నాకూ ఇష్టమే" అంటు సిగ్గుతో లోపలికి పరుగెత్తింది.

"శుభం! ఇక ఆలస్యం ఎందుకు? నేనూ మన పురోహితుడు రామశాస్త్రిగార్ని కలిసి వస్తా" అంటు బయటకు వెళ్ళాడు రాఘవశర్మ.

మరునాడు ఉదయమే ఫోనులో గణపతిశాస్త్రి "రాఘవా! రాత్రి సిద్ధాంతితో, మా వాడితో కూడా సంప్రదించానురా! ఈ నెల ఇరవై తారీఖు రాత్రి తొమ్మిదీ పది నిముషాలకు ముహూర్తం, మా వాడు అమెరికా నుండి పదిహేడున వస్తాడు" అంటుండగా మరి నిశ్చితార్థం? అన్నాడు రాఘవవర్మ. "ఆ! అదే చెబుతున్నా, ఆ కార్యక్రమం పద్దెనిమిది పెట్టుకుందాం, ఆరోజు మా వాడు కాస్త ముందుగా మీ ఇంటికి వచ్చి మీతో, మీ అమ్మాయితో మాట్లాడతాడు, ఉన్న కాస్త సమయంలో అన్నీ సర్దుకోవడమే! ఏమంటావ్? అన్నాడు గణపతిశాస్త్రి. "నువ్వు ఇంత శ్రద్ధగా ప్లాను వేసిన తరువాత ఇక నేను అనటానికేముంది? అలాగే కానిద్దాం" అన్నాడు రాఘవశర్మ.

పదిహేడో తారీఖు రావడం, అమెరికా వేణు సిటీలో కాలు పెట్టడం అనుకున్నట్లే జరిగాయి. మరునాడు సాయంత్రం ఆరు గంటలకు నిశ్చితార్థం ఏర్పాటు కాగా మూడు గంటలకు వేణు మీ ఇంటికి వస్తాడని గణపతిశాస్త్రి రాఘవశర్మతో చెప్పటం కూడా జరిగింది.

మరుసటిరోజు మధ్యాహ్నం మూడు గంటల సమయం కూడా ఆసన్నమయింది. రాఘవశర్మ, తాయారు, కళ్యాణి, అప్పటికే వచ్చి ఉన్న ఆమె స్నేహితురాళ్ళు అందరు వేణూ కోసం ఎదురుచూస్తున్నారు. సరిగ్గా అదే సమయానికి ఒక యువకుడు యమహా మోటర్ సైకిల్ మీద వచ్చాడు. లాల్చీ పైజమా వేసుకొని ఉన్నాడు, బంగారు ఛాయ, నడకలో ఠీవి, ముఖంలో మందహాసం చూడముచ్చటగా ఉన్నాడు. "వావ్! వాటే హేండ్సం గై!" అన్నది ఒక స్నేహితురాలు.

అందరూ అతన్ని ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తున్నారు. అతను లోపలికి వచ్చి "నమస్కారమండీ, నా పేరు విష్ణుశర్మ, అత్యుతరామశాస్త్రిగారి అబ్బాయిని, సాయంత్రం కార్యక్రమానికి ఏర్పాట్లు ఒకసారి చూసి రమ్మన్నారు" అన్నాడు. ఆశ్చర్యాన్నుంచి తేరుకొని రాఘవశర్మ "నా బదులు మా అబ్బాయి వస్తాడు అని రామశాస్త్రిగారు చెప్పారు నువ్వేనా?" అన్నాడు. "పెళ్ళికొడుకు అనుకున్నాము పురోహితుడా!"

అనేసింది మరొక స్నేహితురాలు. ఆ మాటలు విన్నా చిన్నగా నవ్వుకున్నాడు అతను. అంతలో కారుహారన్ మ్రోగింది. అందరి దృష్టి మళ్ళీ అటువైపు తిరిగింది.

"ఒక విచిత్రమైన వ్యక్తి వాకిలి దగ్గరకు వచ్చి "మే ఐ కమిన్?" అన్నాడు స్టయిల్‌గా. పిల్లి గడ్డం, మెడకిందవరకూ జుట్టు, ఏమిటేమిటో రాసి ఉన్న చిత్రమైన టీ షర్టు, జీన్స్‌పాంట్, నల్లకళ్ళద్దాలు, అన్నిటినీ మించి పెద్ద పోజు, బఫూన్‌కి ఎక్కువ మాంత్రికుడికి తక్కువ అన్నట్లున్నాడు.

అతన్ని ఎవరూ గుర్తుపట్టలేదు. రాఘవశర్మ మాత్రం కాస్త తేరుకొని "బాబూ నువ్వు వేణూవా?" అడిగాడు కాస్త సందేహంగా అతనికోసమే అందరూ ఎదురు చూస్తున్నారు కాబట్టి ఊహించి.

"అవును అంకుల్ గుర్తుపట్టలేదా? ఫన్నీ! హాయ్ ఆంటీ! హాయ్ కళ్యాణీ! హౌ ఆర్ యూ? హాయ్‌గల్స్! అంటూ ఊగిపోతున్నాడు. అందరూ ఈ హడావిడికి కాసేపు స్తంభించిపోయారు. రాఘవశర్మ మళ్ళీ కాస్త తమాయించుకొని "రా బాబూ రా! కూర్చో" అని కుర్చీ చూపించాడు. కుర్చీలో కాలుమీద కాలు వేసుకొని ఠీవిగా కూర్చొని "మీరు ఎవరో నాకు గుర్తు రావడం లేదు" అన్నాడు విష్ణుశర్మవైపు చూస్తూ. "అతను పురోహితుడు బాబు" చెప్పాడు రాఘవశర్మ.

"అవునా! స్ట్రేంజ్! హాయ్ యంగ్ మాన్! నీకు పెళ్ళయిందా" అడిగాడు ఏకవచన ప్రయోగం చేస్తూ. కాలేదన్నట్లు తలూపాడు విష్ణుశర్మ. "ఇటీజ్ వెరీ ఫన్నీ! పెళ్ళి కాకుండానే పెళ్ళిళ్ళు చేయిస్తావా?" అన్నాడు పెద్దగా నవ్వుతూ. అతను ఏమీ మాట్లాడలేదు.

"సో! ఎల్లుండి నా డ్యూటీ ఏమిటీ? అనవసరమైన కార్యక్రమాలన్నీ పెట్టి నన్ను విసిగించకండి, ఎంత సింపుల్‌గా ఉంటే అంత మంచిది" అన్నాడు బుజాలు ఎగరేస్తూ.

"మీకు ఉపనయనం అయింది అని విన్నాను, కాబట్టి పెళ్ళిముందు ఆ హడావిడి లేదు కొంత సమయం మిగిలినట్లే, అన్నట్లు మీకు జంధ్యం ఉన్నదా! అక్కడ సంధ్యావందనం చేస్తున్నారా? అడిగాడు విష్ణుశర్మ సరదాగా. వేణు పెద్దగా నవ్వి "సంధ్యావందనమా! ఫన్నీ! అలాంటివి చెయ్యటానికి అక్కడ టైమ్ ఉండదు, అందుకే ఎప్పుడో తీసేసా" అన్నాడు ఘనకార్యం చేసినట్లు.

"ఊహించే అడిగానులెండి, ఎల్లుండి ఉదయం నేను ఒకటి తెస్తాను, అది మీరు ధరించాలి, ఇంక కార్యక్రమాలకొస్తే స్నాతకము, కాశీయాత్ర, వరపూజ లాంటివి పెళ్ళిముందు ఉంటాయి, పెళ్ళిలో పెళ్ళి తరువాత కొన్ని తప్పనిసరి కార్యక్రమాలు కొన్ని సరదా వేడుకలు ఉంటాయి" అన్నాడు" విష్ణుశర్మ.

"వాట్ అంకుల్! ఇవన్నీ అవసరమా? పెళ్ళికని వచ్చి కాశీ యాత్ర ఏమిటి? చాదస్తం కాకపోతే! అలాంటివి నాకు సిల్లీగా అనిపిస్తాయి, అనవసర కార్యక్రమాలన్నీ పెట్టుకొని బోలెడంత డబ్బు తగలేసే బదులు సింపుల్‌గా పెళ్ళిళ్ళు చేసుకొనే స్థితికి మనవాళ్ళు ఎప్పుడొస్తారో!" అన్నాడు వేణు కాస్త విసుగ్గా.

"మన పెళ్ళి కార్యక్రమాలల్లో ఏదీ చాదస్తం లేదండి, శాస్త్రీయత, సాంప్రదాయము, వేడుక, కట్టుబాటు అన్నీ ఉన్నాయి" అన్నాడు విష్ణుశర్మ. వేణు అహం కాస్త దెబ్బతిన్నది. "సీ మిష్టర్! యూ ఆర్ నాట్ సపోజ్డ్ టు టీచ్ మి" అన్నాడు కాస్త ముఖం సీరియస్‌గా పెట్టి.

"అఫ్కోర్స్ అయామ్ నాట్, బట్ అయాం జస్ట్ ట్రైయింగ్ టు రిమైండ్ యు దోస్ థింగ్స్ బికాజ్ యు ఆర్ ఆల్సో ఫ్రం ఏ ట్రెడిషనల్ ఫ్యామిలి" అన్నాడు విష్ణుశర్మ. వేణూతో సహా అందరూ అతని మాటలకు కాసేపు విస్తుపోయారు. విష్ణుశర్మ కాస్త గంభీరమైన స్వరంతో రాఘవశర్మవైపు చూసి "నేను కార్యక్రమానికి కాస్త ముందుగా వస్తాను నమస్కారం" అని వెళ్ళిపోయాడు.



**కళ్యాణికి అసలే కాస్త దేశభక్తి ఎక్కువ, అతని సంభాషణ మొదటినుంచి ఆమెకు కంపరం పుట్టిస్తున్నది, ఇపుడు ఈ మాటలకు సహనం పూర్తిగా చచ్చిపోయేట్లుంది, వేణు వస్తాడని అనుకున్నంతసేపు పట్టలేదు, మునుపటిలా లేదు, అంతా అయోమయంగా ఉంది. ఆలోచనలో పడింది.**

హైటెక్ పురోహితుడులా ఉన్నాడు, అమెరికాలోనూ ఇలానే ఉంటారు" అన్నాడు వేణు వ్యంగ్యంగా నవ్వుతూ. కానీ ఎవరూ బదులుగా నవ్వలేదు. "వెల్ అంకుల్! పెళ్ళి, హనీమూన్ కాగానే నేను యూ.యస్. వెళ్ళిపోతా, సాధ్యమైనంత త్వరగా మమ్మీ డాడీ వాళ్ళు కళ్యాణిని తీసుకొని అక్కడికి వస్తారు" అన్నాడు. "మీ అమ్మానాన్నలు అక్కడే ఉంటారా, వచ్చేస్తారా బాబూ! అడిగింది తాయారు.

"ఏమో ఆంటీ! నేనైతే రమ్మన్నాను, ఉండగలిగితే సరే, లేకుంటే వాళ్ళు వచ్చేస్తారు, మేము మాత్రం అక్కడే సెటిల్ అవుతాం" అన్నాడు. "అయితే మళ్ళీ మీరు ఇండియాకు ఎప్పుడొస్తారు?" అడిగింది తాయారు కూతురుని మళ్ళీ చూసుకొనేదెప్పుడో అని మనసులో అనుకొని.

"ఇండియాకా? ఎందుకు ఆంటీ? ఏముంది ఇక్కడ? ఎప్పుడూ ఏదో ఒక డిస్ట్రబెన్స్, పైగా ఇన్కం తక్కువ, ఒకసారి అక్కడ హాయిగా ఉండటం అలవాటు పడ్డాక ఇండియాకు రావడం కష్టం. మీ అమ్మాయిని వెబ్‌కామ్ ద్వారా నెట్‌లో చూసుకోవచ్చు మాట్లాడవచ్చు" అని బుజాలు ఎగరేస్తూ, "వెల్! నేను కళ్యాణితో కాస్త విడిగా మాట్లాడాలి" అన్నాడు. రాఘవశర్మ ప్రక్కగదివైపు చూపించగా వేణూ, కళ్యాణి అక్కడకు వెళ్ళి కూర్చున్నారు.

రాఘవశర్మ వేణు మాటలకి ఆలోచనలో పడ్డాడు, భార్యతో "అది కాదు తాయారు! వేణు ఏంటి ఇలా తయారయ్యాడు, ఆ వాలకం ఏమిటి? ఆ మాట్లాడే తీరు ఏమిటి? నాకేమీ అర్థంకావడం లేదు" అన్నాడు కాస్త బెంగగా. "అదేమీలేదు లెండీ అమెరికాలో ఉండే కుర్రాడు కదా! ఆ మాత్రం దర్జా, దర్పం ఉండవా ఏమిటి? అన్నది. "అది కాదే! అక్కడే స్థిరపడతాం, అసలు ఇండియాకే రాము అంటున్నాడు కదా?" అన్నాడు. "ఇప్పుడు అలాగే అంటారులెండి, కొంతకాలం తరువాత అయిన వాళ్ళు కావాలనిపించి అతనే మనసు మార్చుకొని ఇక్కడికి వచ్చేస్తారు" అన్నది లోపల తనకూ నమ్మకం లేకపోయినా.

కళ్యాణి గదిలో అసహనంగా కూర్చుంది. అతను మొదలుపెట్టాడు. "సో! నీవెలా ఫీల్ అవుతున్నావు కళ్యాణీ? అమెరికాకు వెళతావని ఊహించలేదుకదూ? అక్కడ లైఫ్ చాలా బావుంటుంది, నీకూ ఉద్యోగం ఇప్పిస్తా, బోలెడంత సంపాదన, రియల్లీ యూ ఆర్ లక్కీ!" అన్నాడు.

"అయితే కొంతకాలం తరువాతైనా మన దేశానికి వచ్చేది లేదా?" అడిగింది కళ్యాణి. "మీ అమ్మ అడిగిన ప్రశ్నే నువ్వూ అడుగుతున్నావ్, నాకు అక్కడే స్థిరపడాలని ఉంది, నీకూ అలాగే అనిపిస్తుంది చూడు!, అమ్మా నాన్న గురించి అంటావా, వాళ్ళ ఇష్టం, అయినా ఏముంది ఇండియాలో కళ్యాణీ!, ఇక్కడకన్నా అక్కడ పిల్లల ఎడ్యుకేషన్, మెడికల్ ఫెసిలిటీస్ క్వాలిటీ ఎక్కువ, నాకు ఇక్కడకన్నా పదిరెట్లు ఎక్కువ జీతం వస్తుంది, రిచ్ కంట్రీ, అక్కడ సెటిల్ అయ్యే అవకాశం దొరకటం నిజంగా అదృష్టం" అన్నాడు గొప్పగా ఫీల్ అవుతూ.

కళ్యాణికి అసలే కాస్త దేశభక్తి ఎక్కువ, అతని సంభాషణ మొదటినుంచి ఆమెకు కంపరం పుట్టిస్తున్నది, ఇపుడు ఈ మాటలకు సహనం పూర్తిగా చచ్చిపోయేట్లుంది, వేణు వస్తాడని అనుకున్నంతసేపు పట్టలేదు, మునుపటిలా లేదు, అంతా అయోమయంగా ఉంది. ఆలోచనలో పడింది. అంతరాయం కలిగిస్తూ "వెల్! అమెరికా విషయాలు నీతో చాలా చెప్పాలి, అందుకే రేపు నూన్‌షోకి ప్లాన్ చేసా! ఇద్దరం వెళ్ళి సినిమా చూసి అలా సరదాగా తిరిగివద్దాం" అన్నాడు ఉత్సాహంగా.

"సారీ! నేను రాలేను" అన్నది కళ్యాణి. ఖంగుతిన్నాడు వేణు "వాట్! ఏమన్నావ్?" కాస్త విసుగ్గా అన్నాడు. "పెళ్ళికి ముందు అలా తిరగడం నాకు నచ్చదు అంటున్నాను" కొంచెం సీరియస్‌గానే చెప్పింది. "ఏమిటి నువ్వు మాట్లాడేది? ఇవాళ నిశ్చితార్థం, అంటే సగం పెళ్ళి అయినట్లే కదా?" అన్నాడు. "పూర్తిగా కాదుగా?" అన్నదామె. "ఇటీజ్ టూ మచ్ కళ్యాణీ! పి.జి. చేసావ్, ఇంత చాదస్తమా?" అన్నాడు ఆశ్చర్యంగా. •

"పి.జి.లో ఇలాంటివి చెప్పరు, అయినా ఒక్కరోజులో తొందరేముంది?" అన్నది అసహనంగా. అవమానంగా భావించాడు వేణు. "యూ ఆర్ ఇన్సల్టింగ్ మి, నువ్వు ఇంత పాత చింతకాయ పచ్చడివి అనుకోలేదు" అన్నాడు బిగ్గరగా. కళ్యాణి ఇక అక్కడ కూర్చోలేక లేచి వెళ్ళబోయింది, "స్టాప్! హియర్ మి" అని ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె విదిలించుకొని బయటకు వచ్చేసింది.

అప్పటికే అక్కడ వేణు తల్లిదండ్రులు, ఇరువురి బంధువులు, పురోహితుడు విష్ణుశర్మ కూర్చొని ఉన్నారు కళ్యాణి విసురుగా రావడం చూసి అందరూ లేచి నిలుచున్నారు. బుసలు కొడుతూ బయటకు వచ్చాడు వేణు. "వాట్ అంకుల్? కళ్యాణి ఇంత పాతకాలం మనిషని నేను అనుకోలేదు, నా భావాలకు విలువ ఇవ్వకుండా ఇలా మధ్యలో లేచి రావడం సభ్యతేనా?" అన్నాడు ఉరిమిచూస్తూ.

"స్టాపిట్ మిస్టర్! ఇక చాలు, సభ్యత గురించి నువ్వు మాట్లాడితే బావుండదు" అన్నది ఆవేశంగా. ఇంకా రెచ్చిపోయాడు వేణు "ఏమిటి నీ పొగరు? కోరి వచ్చానని చులకన చేస్తున్నావా? నా నిర్ణయం మార్చుకుంటే నీ గతి ఏమవుతుందో ఆలోచించు" అన్నాడు ఊగిపోతూ. "ఇందాకటి నుంచి నీ నిర్ణయాలు చాలా చెపుతూనే ఉన్నావ్, ఇది కూడా చెప్పు" అన్నది కోపం వ్యంగ్యం కలసిన స్వరంతో. "ఏమిటా? ఇప్పుడు నేను కాదంటే నిన్ను ఎవరు చేసుకుంటారు?" అన్నాడు హేళనగా.

అందరూ నోరుతెరిచి ఆశ్చర్యంగా చూస్తున్నారు, హాలు అంతా నిశ్శబ్దం ఆవహించింది, ఊహించని సన్నివేశం, ఏమి చేయాలో ఎవరికీ అర్థంకావడంలేదు.

కళ్యాణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అయినా తమాయించుకొని "నాన్నా! నేను రెండు నిముషాలు మాట్లాడొచ్చా?" అడిగింది. రాఘవశర్మ నిశ్చేష్టుడై నిలుచొని ఉన్నాడు, మాట్లాడే స్థితిలో లేడు".

"ఇక్కడ ఉన్నవారంతా నన్ను క్షమించాలి! ఈ అమ్మాయి ఏమిటి ఇలా బరితెగించి మాట్లాడుతున్నది అని అనుకోకండి, ఈ పెళ్ళి నాకు ఇష్టంలేదు" అన్నది. అందరితో పాటు వేణు, అతని తల్లిదండ్రులు విస్తుపోయారు. "అవును, ఇతని పద్ధతి నాకు నచ్చలేదు, ఎదుటివారి ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకొనే స్థితిలో ఇతను లేడు, అన్ని నిర్ణయాలూ తనే తీసుకుంటాడు.

అమెరికాలో స్థిరపడటం అదృష్టమట, ఇక్కడ పుట్టి, ఇక్కడ పెరిగి, ఇక్కడి స్కూళ్ళలో కాలేజీలలో చదివి ఇప్పుడు ఈ దేశమే నచ్చటంలేదుట, అమెరికాలో ఉండలేకపోతే తల్లిదండ్రులని పంపించేస్తాడుట, కాని తను మాత్రం రాడుట. అసలు అక్కడే ఉండటం తన తల్లిదండ్రులకు గాని కట్టుకోబోయే వ్యక్తికిగానీ ఇష్టం ఉందా లేదా అని అడగాలని కూడా అతనికి అనిపించటంలేదు. అమ్మా నాన్నల మీద ప్రేమలేనివాడు, పుట్టిన దేశాన్ని హేళన చేసేవాడు నా దృష్టిలో నీచాతినీచుడు, అయినా అమెరికా ఈయన ఒక్కడే వెళ్ళాడా? ఒకప్పుడు అమెరికా వెళ్ళి వచ్చాడంటే గొప్పగా చూసేవారు, ఇప్పుడు ఇంటికొకరున్నారు అక్కడ, అందరూ ఈయనలాగా ఉన్నారా? ఎంతమంది అక్కడ సంపాదించి వచ్చి ఇక్కడ సెటిల్ అవడంలేదు? కొందరైతే తాము పుట్టిన గ్రామాలు దత్తత తీసుకొని మరీ ఆర్థికంగా అభివృద్ధి చేయడం మనం వినడంలేదా? తప్పనిసరి కారణాలవల్ల ఎంతోమంది ఇండియాకు దీర్ఘకాలంగా రాలేక గుండెల్లో తమ దేశాన్ని ప్రేమిస్తూ, పూజిస్తూ ఉన్నారు ఈయనకు తెలీదా?

అందరూ మన సాంప్రదాయాలను గౌరవిస్తుంటే ఈయనకు మాత్రం పాత చింతకాయపచ్చడి అనిపిస్తున్నదా? ఇలాంటి వ్యక్తిని చేసుకొని మన దేశాన్ని అయినవాళ్ళని వదలి శాశ్వతంగా అక్కడకు వెళ్ళటానికి నాకేమి అమెరికా దెయ్యం పట్టలేదు, అసలు మన దేశాన్ని చులకన చేసి మాట్లాడేవాళ్ళకి ఇక్కడికి రాకుండా వీసాలు రద్దు చేసే చట్టం ఏదైనా రావాలి" అని ముగించింది, వేణువైపు కోపంగా చూస్తూ.

వేణు రెట్టింపు ఆవేశంతో అందుకున్నాడు "నాకు ఇప్పుడు అర్థమయింది, నీకే నన్ను చేసుకునే అర్హతలేదు, అక్కడ నా పరువు తీస్తావు, నీకు ఈ పురోహితుడు విష్ణుశర్మలాంటివాడే సరిజోడు" అన్నాడు వ్యంగ్యంగా. అతని మాటలకు విష్ణుశర్మతో పాటు అందరూ నిర్ఘాంతపోయారు.

చప్పట్లు కొట్టింది కళ్యాణి "ఫెంటాస్టిక్! ఇప్పటిదాకా నువ్వు మాట్లాడిన మాటల్లోకి ఇదే కాస్త అర్థవంతంగా ఉన్నదనిపిస్తున్నది, నువ్వు ఎన్ని రెట్లు డబ్బు సంపాయిస్తున్నావని అనుకుంటున్నావో అంతకన్నా ఎక్కువ సభ్యత సంస్కారం అతను ఇండియాలో ఉండే సంపాయించారు, ఆయన మాటల్లోనే అవి కనబడుతున్నాయి, మీ ఇద్దరికీ తూర్పు పడమరకు ఉన్నంత వ్యత్యాసం. ఇందాక మీ ఇద్దరి వాదనతో అది తేటతెల్లమయింది.

వేణూ ఆవేశం కట్టలు తెంచుకుంది, "ఈజిట్? అయితే ఇంకే! అతన్నే చేసుకో, గుడ్ బై" అని విసురుగా వెళ్ళిపోయాడు. గణపతిశాస్త్రి కూడా చేసేది లేక మెల్లగా రాఘవశర్మ దగ్గరకు వచ్చి చేయి పట్టుకొని క్షమించమన్నట్లుగా చూసి భార్యతో సహా వెళ్ళిపోయాడు.

అంతా నిశ్శబ్దం, పెళ్ళిపెద్దలందరూ మూగవారైపోయారు, రాఘవశర్మ తాయారులు ఇంకా తేరుకోలేదు. అందరి చూపులు విష్ణుశర్మవైపు తిరిగాయి, అతను ఏదో ఆలోచనలో పడ్డాడు, కళ్యాణి చిన్నగా విష్ణుశర్మ వద్దకు వెళ్ళి "మీరు నన్ను క్షమించాలి, అనవసరంగా అతను మిమ్మల్ని ఈ విషయంలోకి లాగి చులకనగా మాట్లాడాడు అంటుండగా రాఘవశర్మ "అమ్మా! కళ్యాణీ!" అన్నాడు కంటతడి ఆపుకుంటూ, "బాధపడకు నాన్నా! ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది, అయినా నా జీవితం ప్రమాదంలో పడలేదని నేను సంతోషిస్తున్నాను" అని తండ్రి గుండెలమీద తల ఆనించి సేద తీరుతున్నది. గంభీరమైన స్వరంతో విష్ణుశర్మ "రాఘవశర్మగారూ! నేను ఇప్పుడు ఇలా మాట్లాడటం సరైందో కాదో తెలియదు, మీరు అవునన్నా కాదన్నా నాకొకటి చెప్పాలని అనిపిస్తున్నది, మీకు అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని నేను వివాహం చేసుకుంటాను.

ఈ మాటలు ఏదో ఇవాళ ఇలా జరిగిందని జాలితో అనడం లేదు, ఆమె ఆత్మాభిమానం, మన సాంప్రదాయాలపట్ల, దేశంపట్ల ఆమెకున్న గౌరవం నాకు బాగా నచ్చాయి నన్ను ఇలా మాట్లాడిస్తున్నాయి, ఆమె బాధపడకుండా చెయ్యాలనేది కూడా నా ఉద్దేశ్యం, ఇక మీ అమ్మాయి ఇష్టం, నిర్ణయం ఏదైనా నేను సరళంగానే తీసుకుంటాను" అన్నాడు. రాఘవశర్మ దంపతులతో పాటు కళ్యాణి ముఖం కూడా ఆనందంతో వికసించింది, ఆమె కన్నీరు ఆనంద భాష్పాలుగా మారాయి.

"చాలా సంతోషం బాబూ! అని అతన్ని కౌగలించుకున్నాడు రాఘవశర్మ. "మా నాన్నగారితో నేను మాట్లాడతాను, మీరూ జరగాల్సింది ఆయనతో సంప్రదించండి" అంటుండగా,

విష్ణుశర్మ తండ్రి అత్యుతరామశాస్త్రి "ఇక సంప్రదించేది ఏముందిరా! కార్యక్రమం నీవు ఎలా చేస్తున్నావో చూద్దామని వచ్చా, సగం విషయం బయట విన్నా, సగం ఇక్కడ చూసా, రాఘవశర్మగారి కుటుంబం నాకు బాగా తెలుసు, లక్షణమైన అమ్మాయి కోడలుగా వస్తుంటే నాకూ సంతోషమే, ఇక నిశ్చితార్థం అవసరంలేదు, ఎల్లుండి ముహూర్తానికే వివాహం" అన్నాడు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు, గంభీర వాతావరణం ఆనందమయంగా మారింది.

రాఘవశర్మ వచ్చి రామశాస్త్రి చేతులు పట్టుకున్నాడు కృతజ్ఞతగా. "ఈ ఆనంద సమయంలో మా కోడలికి మరొక సంతోషమైన విషయం చెబుతాను" అన్నాడు రామశాస్త్రి. కళ్యాణితో పాటు అందరూ అదేమిటా అని ఆతృతగా చూస్తున్నరు. "మా విష్ణుకి పౌరోహిత్యం ఒక్కటే వృత్తి కాదు, బీ.టెక్.చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ వృత్తి నాతో ఆగిపోతుందేమోనన్న నాఆవేదనను పసిగట్టి, పౌరోహిత్యం నేర్చుకొని శని ఆదివారాల్లో వచ్చే వివాహాలు నా బదులు తను చేయిస్తుంటాడు" అన్నాడు. ఆ మాటకు కళ్యాణితో పాటు అక్కడ ఉన్న అందరూ కరతాళధ్వనులు చేస్తుండగా రుక్మిణీదేవికోసం వచ్చిన శ్రీకృష్ణుడులా మందహాసంతో నిలుచున్నాడు విష్ణుశర్మ. ●

